కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -209 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 10-08-2026 | సోమవారం | పేజీలు : 4

# కమలం కోటలో జనసేన జోరు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో పొత్తులు, చేరికల రాజకీయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఎన్డీయే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న బీజేపీ, జనసేన మధ్య తాజా పరిణామాలు తెలంగాణలో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్రంలో తాము ఒంటరిగానే వెళ్తామని బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు స్టేట్ మెంట్ ఇవ్వగా, ఇది రామచందర్ రావు పరిధిలోని అంశం కాదని పొత్తుల అంశాన్ని పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందంటూ జనసేన తెలంగాణ శాఖ అధ్యక్షుడు శంకర్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరువు నేతల మధ్య డైలాగ్ వార్ చల్లారక ముందే మిత్రపక్షం బీజేపీకి జనసేన బిగ్ షాక్ ఇచ్చింది. పలువురు బీజేపీ నాయకులను జనసేన పార్టీలో చేరడం ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కలకలం రేపుతోంది. త్వరలోనే బీజేపీలో ఇతర పార్టీల పెద్ద తలకాయలు చేరబోతున్నాయని కమలం పార్టీ అగ్రనేతలు చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఇంత కాలం బీజేపీ కోసం సీరియస్‌గా పని చేసిన పలువురు నాయకులు జనసేన గూటికి చేరడం, వారిని స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీకి ఆహ్వానించడంతో తెలంగాణ బీజేపీలో కలకలం రేపుతోంది.

మిగతాది 2 లో..

- కమలం కోటలో కాపు కదలిక
- బీజేపీ నేతలపై పవన్ ఫోకస్
- మిత్రపక్షానికే గట్టి షాక్
- పవన్ దూకుడుతో కమలంలో కలవరం
- బీజేపీ నేతలకు జనసేన గాలం
- సెట్ రైట్ వేళ సరికొత్త ట్విస్ట్
- కమలం క్యాడర్‌లో కొత్త టెన్షన్
- పవన్ ఎంట్రీతో మారుతున్న సీన్
- బీజేపీ-జనసేన మధ్య పెరుగుతున్న గ్యాప్

# ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- 32 జిల్లాల్లో కార్డుల పంపిణీ
- 1.05 కోట్ల కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- 3.42 కోట్ల మందికి ఆహార భద్రత
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు
- సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్




**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆగస్టు 15న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

# ఆత్మగౌరవం కోసం అండగా నిలుద్దాం




- ప్రకృతి పరిరక్షణలో ఆదివాసీల స్ఫూర్తి ఆదర్శం
- ఆదివాసీ సంస్కృతి యావత్ మానవాళికి మార్గదర్శకం
- హక్కులు, అస్తిత్వం, సంస్కృతిని గౌరవించాలి
- జల్-జంగల్-జమీన్ పరిరక్షణలో స్ఫూర్తి ఆదర్శం

# 'జెన్-జీని తప్పుదోవ పట్టించారు'

- రాజీనామాపై ధర్మేంద్ర ప్రధాన్ స్పందన
- నీట్ నిరసనలతో పదవికి రాజీనామా
- పదవి కంటే యువతే ముఖ్యమన్న ప్రధాన్
- నవీన్ పట్నాయక్‌పై తీవ్ర విమర్శలు
- 'గో బ్యాక్' నినాదాలకు భయపడను
- రైతు బిడ్డను.. మళ్లీ వస్తూనే ఉంటా



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా 'జెన్-జీ' యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని శనివారం వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో జూలై 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండు వారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు.

జెన్-జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

2 లో

# దుర్గమ్మ లడ్డూకు డిజిటల్ ఏటీఎం




- ఓటీపీ ఎంటర్ చేస్తే లడ్డూ చేతికి
- ఆన్‌లైన్ బుకింగ్‌తో నేరుగా ప్రసాదం
- ఒక్కసారి ఆరు లడ్డూల వరకు తీసుకోవచ్చు
- దసరా నాటికి ఆరు ఏటీఎంలు అందుబాటులోకి
- క్యూ లైన్లకు చెక్ పెట్టేందుకు కొత్త విధానం
- భారీ రద్దీ నియంత్రణకు డిజిటల్ వ్యవస్థ

# అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్




- పహల్గామ్, బాల్తాల్ మార్గాల్లో యాత్ర నిలిపివేత
- ప్రతికూల వాతావరణంతో ముందస్తు జాగ్రత్త చర్యలు
- యాత్ర మార్గాల్లో మరమ్మతులు కొనసాగిస్తున్న అధికారులు
- శనివారం ఒక్కరోజే 3,336 మంది దర్శనం
- ఇప్పటివరకు 4.80 లక్షల మంది భక్తుల దర్శనం
- యాత్రికుల భద్రతే ప్రధాన లక్ష్యమన్న అధికారులు

# బోనాల సందడితో భాగ్యనగరం

- లాల్‌దర్వాజాకు భక్తుల పోటెత్తు
- అమ్మవారి దర్శనానికి భారీ రద్దీ
- పోతురాజుల విన్యాసాలతో హోరు
- 2,500 మంది పోలీసులతో బందోబస్తు
- ప్రముఖుల అమ్మవారి దర్శనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు




**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం ఉదయం నుంచి ఘనంగా కొనసాగుతున్నాయి. ఆషాఢమాసం చివరి ఆదివారం రోజు కావడంతో భాగ్యనగరం అంతా అమ్మవారి బోనాలతో నగరమంతా ప్రత్యేక శోభ సంతరించుకుంది. నగరంలోని ఆయా ప్రాంతాల్లో కొలువైన పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, భవాని, మహంకాళి తదితర అమ్మవార్ల ఆలయాలకు బోనం సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. మహిళలు వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలు నెత్తినపెట్టుకుని అమ్మవార్ల ఆలయాలకు బయలెల్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బెల్లం సాకపోసి బోనం నైవేద్యంతోపాటు గాజులు, చీరెసారె సమర్పించి తల్లి చల్లంగ చూడమని వేడుకుంటున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువుల చప్పుళ్లతో ఎటు చూసినా నగరమంతా హోరెత్తుతోంది. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారకి ప్రభుత్వం తరఫున అమ్మవారికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించగా, అక్కన్న మాదనన్న మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీధర్ బాబు, అంబర్‌పేట అమ్మవారి ఆలయంలో ప్రభుత్వం తరఫున మంత్రి సీతక్క పట్టువస్త్రాలు సమర్పించారు.

# లష్కరే కమాండర్ అనుమానాస్పద మృతి

- మసీదు వద్దే కుప్పకూలిన కమాండర్
- భోజనం తర్వాత ఒక్కసారిగా మృతి
- మృతికి కారణం ఇంకా సస్పెన్స్
- ఉగ్రవాద సంస్థలో కలకలం
- 30 మంది సభ్యుల హత్యలపై వ్యాఖ్యలు
- కీలక నేతల వరుస మరణాలు

# మహిళలకు ఉచితంగా కొత్త చీరలు

- చిలకపచ్చ రంగులో కొత్త డిజైన్
- నేతన్నలకు భారీ ఆర్డర్లు
- రూ.450 కోట్లతో చీరల ఉత్పత్తి
- 4.62 కోట్ల మీటర్లకు ఆర్డర్లు
- సెప్టెంబరు 20లోగా ఉత్పత్తి పూర్తి
- అక్టోబర్‌లో మహిళలకు పంపిణీ




**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** మహిళా సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మహిళా సంఘాలకు అందించే చీరల కోసం మే నెలలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటివరకు 1.74 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో నీలం రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. చీరల ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్‌లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.

ఈ ఏడాది మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల కోసం ప్రభుత్వం రూ.450 కోట్లను కేటాయించింది.

# మావోయిజం ఖతం.. డ్రగ్స్ భూతం

- యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతం
- డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక వ్యూహాలు అమలు
- ముప్పు స్థాయిని బట్టి గన్‌మెన్ల తగ్గింపు
- భద్రత తగ్గింపులో రాజకీయ కోణం లేదన్న డీజీపీ
- గ్రేహౌండ్స్, ఎస్ఐబీ సేవలకు కొత్త బాధ్యతలు
- సైబర్ నేరాలు, కల్తీపై పోలీసుల ఫోకస్

2 లో

# సర్పిహాల్‌లో వింత వ్యాధి కలకలం

- 100 మందికి పైగా తీవ్ర అస్వస్థత
- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు బాధితులు
- గ్రామానికి చేరుకున్న ప్రత్యేక వైద్య బృందాలు
- చిన్నారుల్లో ఒకరిద్దరి పరిస్థితి విషమం
- కలుషిత నీరు, ఆహారంపై అధికారుల అనుమానం
- నమూనాల పరీక్షల తర్వాత కారణం తేలే అవకాశం

2 లో

# బోనాల సందడితో భాగ్యనగరం

మొదటి పేజీ తరువాయి

మాదన్నపేట నల్లపోచమ్మను కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు.

అట్టహాసంగా లాల్ దర్వాజా బోనాలు:

లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ వార్షిక బోనాల బ్రహ్మోత్సవాలు కావడంతో అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలకంరణ చేపట్టారు. దేవాలయం తరపున అమ్మవారికి తొలిబోనం సమర్పించగా రాత్రి 10:30 వరకు అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం, చీర, సారె సమర్పణ జరిగింది. సాయంత్రం సింహవాహిని అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. 2,500 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు రంగం, భవిష్య వాణి, పోతురాజుల విన్యాసాలు, భవానీ రథ యాత్ర జరగనుంది.

అమ్మవారిని దర్శించుకున్ని సినీ, రాజకీయ ప్రముఖులు

సింహవాహినీ అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుంటున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీ నటుడు విజయ్ దేవరకొండ ఆనంద్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శించుకున్నారు.జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, సింగర్ మంగ్లీ అమ్మవారికి బోనం సమర్పించారు.

# ఆత్మగౌరవం కోసం అండగా నిలుద్దాం

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** ప్రపంచ నాగరికతకు మూలం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం – ఆదివాసీ సంస్కృతి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తరతరాలుగా ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా మలుచుకున్న ఆదివాసీ సమాజాల జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమిష్టి జీవన విధానం, సాంస్కృతిక పరిరక్షణ యావత్ మానవాళికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ప్రకృతిని దైవంగా, అడవిని తల్లిగా, తమ సంస్కృతి సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న ఆదివాసీ సోదర సోదరీమణులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారి హక్కులను, అస్తిత్వాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం మనమంతా కలిసి నిలబడాలని పేర్కొన్నారు. జల్–జంగల్–జమీన్ పరిరక్షణలో వారి స్ఫూర్తి సదా ఆదర్శం అని కొనియాడారు.

# సర్దిహాలో వింత వ్యాధి కలకలం



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** ఓ గ్రామంలో ఒక్కసారిగా వింత వ్యాధి వ్యాపించడంతో పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రి పాలు కావడం కలకలం రేపింది. ఈ షాకింగ్ ఘటన బీహార్‌లోని సహర్సా జిల్లా పరిధిలోని సర్దిహా గ్రామంలో చోటు చేసుకుంది. దాదాపు 100 మందికి పైగా గ్రామస్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులంతా వికారాలు, వాంతులు, విరేచనాలు, తీవ్ర జ్వరంతో బాధ పడుతుండటంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే వైద్య బృందాలు గ్రామానికి చేరుకుని స్థానికంగా బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయి.

బాధితులకు చికిత్స కొనసాగుతోందని, వీరిలో ఒకరిద్దరు చిన్నారుల పరిస్థితి కాస్త విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని సదర్ ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా సివిల్ సర్జన్ రాజ్ నారాయణ్ ప్రసాద్ తెలిపారు. కలుషిత నీరు, ఆహారం వికటించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి విచారణ, నమూనాల పరీక్షల నివేదికల అనంతరం మాత్రమే ఈ అస్వస్థతకు అసలు కారణాలు స్పష్టంగా తెలుస్తాయని వైద్య అధికారులు వెల్లడించారు.

# లష్కరే కమాండర్ అనుమానాస్పద మృతి



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా సీనియర్ కమాండర్ ఖారీ సయీద్ అబ్దుల్ అజీజ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఒక కొత్త రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం ప్రార్థనల కోసం మసీదుకు వచ్చిన ఆయన, అకస్మాత్తుగా గేటు వద్దే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. మృతికి గల కచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమైన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక, ఇతర సహాయ సహకారాలు అందించే విభాగానికి ఖారీ సయీద్ బాధ్యుడిగా వ్యవహరిస్తున్నాడు.

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వ్యాప్తంగా గత మూడేళ్లలో తమ సంస్థకు చెందిన దాదాపు 30 మంది సభ్యులను "అపరిచిత వ్యక్తులు" హతమార్చారని లష్కరే అగ్రనేత రిజ్వాన్ హనీఫ్ సంచలన వ్యాఖ్యలు చేసిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. 2008 ముంబై దాడుల వెనుక ఉన్న ఈ ఉగ్రవాద సంస్థలోని కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండటం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌లో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఈ మృతిపై స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** జమ్మూ కాశ్మీర్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, యాత్రా మార్గాల రిపేరు పనులు, రాబోయే రోజుల్లో ప్రతికూల వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పహల్గామ్, బాల్తాల్ రెండింటి మార్గాల నుండి వార్షిక అమర్‌నాథ్ యాత్రను ఆదివారం నుండి తాత్కాలికంగా నిలిపివేశారు. భారత వాతావరణ శాఖ జారీ చేసిన వాతావరణ సూచనలు, ట్రాక్‌ల ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. రాంబన్ జిల్లాతో పాటు కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యగా నిన్న జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుండి ఏ కొత్త యాత్రికుల కాన్వాయ్‌ని కూడా అనుమతించలేదు. మరోవైపు.. పవిత్ర గుహలో దర్శనం ముగించుకుని బాల్తాల్ బేస్ క్యాంప్‌లో ఉంటున్న 1,202 మంది యాత్రికులతో కూడిన 28వ బ్యాచ్‌ను 44 వాహనాల కాన్వాయ్‌లో జమ్మూ వైపు వెళ్ళేందుకు అనుమతించారు. తిరుగు ప్రయాణమైన ఈ యాత్రికులలో 867 మంది పురుషులు, 251 మంది మహిళలు, ఒక చిన్నారి, 79 మంది సాధువులు, నలుగురు సాధ్వీలు ఉన్నారు.

నిన్న ఒక్కరోజే మొత్తం 3,336 మంది యాత్రికులు అమర్‌నాథ్ పవిత్ర గుహను దర్శించుకున్నారు. వీరిలో 2,384 మంది పురుషులు, 569 మంది మహిళలు, 21 మంది పిల్లలు, 20 మంది సాధువులు, ఆరుగురు సాధ్వీలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు మరియు 332 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. దీంతో 2026 అమర్‌నాథ్ యాత్రలో ఇప్పటివరకు పవిత్ర దర్శనం చేసుకున్న మొత్తం యాత్రికుల సంఖ్య 4 లక్షల 80 వేల 19కి చేరింది. కాగా.. జూలై 3న అనంతనాగ్ జిల్లాలోని సాంప్రదాయ చందన్‌వారీ మార్గం, గందర్‌బాల్ జిల్లాలోని బాల్తాల్ మార్గం గుండా ఒకేసారి ప్రారంభమైన ఈ 57 రోజుల అమర్‌నాథ్ యాత్ర, ఆగస్టు 28న సాంప్రదాయ 'ఛడీ ముబారక్' వేడుకతో ముగియనుంది. అయితే.. ఇటీవలి వర్షాల కారణంగా సున్నితమైన యాత్రా మార్గాల్లో రిపేరు, నిర్వహణ పనులు చేపట్టాల్సిన అవసరం ఏర్పడటంతో, సరిహద్దు రోడ్ల సంస్థ ఈ పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తోంది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతికూల వాతావరణం ఉంటుందని ఐఎండ్ హెచ్చరించినందున యాత్రను నిలిపివేస్తున్నామని, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

సంగారెడ్డిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లో కూడా మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3.42 కోట్ల మందికి ఆహార భద్రత

ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. అదనంగా 61.09 లక్షల మంది ఆహార భద్రత పరిధిలోకి వచ్చారు. కొత్త కార్డుల మంజూరుతో తెలంగాణలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరగా, 3.42 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభిస్తోంది. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసింది. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ఇచ్చారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందు జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న లామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులను భద్రంగా ఉంచడంతో పాటు సురక్షితంగా రవాణా చేసి, పంపిణీ కేంద్రాలకు సకాలంలో చేరేలా చూడాలని స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరినీ అధికారికంగా ఆహ్వానించి, కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు.. గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

స్మార్ట్ రేషన్ కార్డుల కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, వివరాల ధ్రువీకరణ, కార్డుల పంపిణీ ప్రక్రియ క్రమబద్ధంగా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించి, రోజువారీ పంపిణీ వివరాలను పౌరసరఫరాల కమిషనర్‌కు నివేదించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో మొత్తం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు సర్క్యులర్ జారీ చేశారు.

# దుర్గమ్మ లడ్డూకు డిజిటల్ ఏటీఎం



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** విజయవాడ ఇంద్రకిలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ఒక తీపి కబురు అందించారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దుర్గమ్మ ఆలయంలో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భక్తులు లడ్డూ ప్రసాదం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకంగా లడ్డూ ఏటీఎం మిషన్లను ఏర్పాటు చేయనున్నారు.

ఈ నూతన విధానంలో భక్తులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా లడ్డూ ప్రసాదాన్ని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ బుకింగ్ పూర్తి కాగానే భక్తుడి మొబైల్ ఫోన్‌కు ఒక ఓటీపీ వస్తుంది. ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లి ఆ ఓటీపీని ఎంటర్ చేయగానే నేరుగా లడ్డూ ప్రసాదం చేతికి అందుతుంది. ఈ మిషన్ల ద్వారా ఒక వ్యక్తి ఒక్కోసారికి ఒకటి నుంచి ఆరు లడ్డూల వరకు పొందే వెసులుబాటు ఉంటుంది. దసరా సమయానికి ఆలయంలో మొత్తం 6 ఏటీఎం మిషన్లను అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాల సమయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఈ సమయంలో దాదాపు 30 లక్షల నుండి 35 లక్షలకు పైగా లడ్డూ ప్రసాదం విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో, రద్దీని నియంత్రించి ప్రసాద విక్రయాలను వేగవంతం చేసేందుకు ఈ డిజిటల్ ఏటీఎం విధానం ఎంతగానో తోడ్పడనుంది.

# 'జెన్-జీని తప్పుదోవ పట్టించారు'

మొదటి పేజీ తరువాయి

భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నారని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యం కాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు.

మరొక సభలో మాట్లాడుతూ.. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తావిస్తూ.. తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పని చేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజల నుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్రమేమిటంటే.. బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# మమతా బెనర్జీ వాహనంపై దాడి.. రాళ్లు, బురదతో విరుచుకుపడిన నిరసనకారులు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కి ఊహించని షాక్ తగిలింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బీజ్‌పూర్ పరిధిలో ఆదివారం లాకప్‌లో మృతి చెందిన టీఎంసీ కార్యకర్త బిర్జూ కేఓట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న క్రమంలో ఆమె వాహనంపై గుంపుగా వచ్చిన నిరసనకారులు దాడికి పాల్పడ్డారు.

మమతా కాన్వాయ్‌ని అడ్డుకున్న నిరసనకారులు 'చోర్.. చోర్' అంటూ నినాదాలు చేస్తూ.. ఆమె వాహనంపైకి రాళ్లు, పాదరక్షలు, నీళ్ల బాటిళ్లు, బురదను ఇలా దొరికింది దొరికినట్లుగా విసిరారు. అయితే, ఈ షాకింగ్ ఘటనపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చూస్తుండగానే అసాంఘిక శక్తులు తన కారుపైకి పెద్ద పెద్ద రాళ్లను విసిరారని తెలిపారు. వాహనంపై దాడి తీవ్ర స్థాయిలో జరిగిందని ఆరోపించారు. ఒకవేళ తాను కారు అద్దాలు గనుక తెరిచి ఉంటే, తలే పగిలిపోయేదని, ప్రాణాలు కోల్పోయేవారని పేర్కొన్నారు. అయితే, ఈ కుట్ర వెనుక పోలీసుల నిర్లక్ష్యం, ప్రత్యర్థి పార్టీల ప్రమేయం ఉందని మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు.

# మహిళలకు ఉచితంగా కొత్త చీరలు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** మహిళా సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మహిళా సంఘాలకు అందించే చీరల కోసం మే నెలలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటివరకు 1.74 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో నీలం రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. చీరల ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్‌లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.

ఈ ఏడాది మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల కోసం ప్రభుత్వం రూ.450 కోట్లను కేటాయించింది. ఇందులో ఇటీవల రూ.142 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. టెస్కోకు నిధులు మంజూరైన వెంటనే చీరల ఉత్పత్తి చేస్తున్న మ్యాక్స్ సంఘాలకు చెల్లింపులు జరగనున్నాయి. దీంతో ఉత్పత్తి ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. తొలుత 133 మ్యాక్స్ సంఘాలకు చీరల ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించారు. వీటిలో 80 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని పూర్తి చేసిన 61 సంఘాలను గుర్తించి ఇటీవల రెండో విడతగా మరో 1.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు.

ఉత్పత్తి పూర్తయిన వస్త్రాన్ని టెస్కో సేకరిస్తోంది. ఒక్కో చీరకు జాకెట్ వస్త్రంతో కలిపి 6.6 మీటర్ల మేర తయారు చేస్తున్నారు. ఒక్కో చీర ఉత్పత్తికి సుమారు రూ.238 ఖర్చవుతోంది. దీనికి అదనంగా ప్రాసెసింగ్, ప్రింటింగ్, రవాణా తదితర ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది. మొత్తం చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని సెప్టెంబరు 20లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. అక్టోబరులో మహిళా సంఘాలకు చీరలను పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. దీంతో గడువులోగా ఉత్పత్తి పూర్తి చేసేందుకు మ్యాక్స్ సంఘాలు పనులను వేగవంతం చేస్తున్నాయి.

మరోవైపు 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకరూప దుస్తుల వస్త్రం విషయంలో నెలకొన్న సమస్యకు కూడా పరిష్కారం లభిస్తోంది. ఫిబ్రవరిలో జిల్లా పరిశ్రమకు 63 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. ఉత్పత్తి ప్రారంభమైన రెండు నెలలకే ఏప్రిల్‌లో ఉత్పత్తిని నిలిపివేయాలని ప్రభుత్వం టెస్కోకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగు నెలలుగా నేతన్నలు అయోమయంలో ఉన్నారు. తాజాగా ఇప్పటికే తయారైన వస్త్రాన్ని సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. 2023 నవంబరులోనూ జిల్లా పరిశ్రమ నుంచి దాదాపు రూ.100 కోట్ల విలువైన వస్త్రాన్ని సేకరించినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో రూ.42 కోట్ల విలువైన వస్త్రానికి లెక్కలు పూర్తయ్యాయి. మరో రూ.50 కోట్ల వరకు విలువైన వస్త్రం ఇంకా పరిశీలించి లెక్కించాల్సి ఉందని అంచనా. ఈ మొత్తాన్ని కూడా త్వరగా విడుదల చేసి ఉత్పత్తిదారులకు చెల్లింపులు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. తాజా చీరల ఆర్డర్లు, పెండింగ్ వస్త్రం సేకరణతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

# మావోయిజం ఖతం.. డ్రగ్స్ భూతం

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో నక్సలిజం (మావోయిజం) పూర్తిగా అంతమైందని, రాష్ట్ర భద్రతకు ఇక ఎలాంటి ముప్పు లేదని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ శాఖలో సమూల మార్పులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా మావోయిస్టుల అదుపుపైనే దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం, ఇప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొనే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. "ప్రస్తుతం రాష్ట్రం ముందున్న అతిపెద్ద సవాలు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, అక్రమ రవాణా. యువతను, విద్యార్థులను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నాం," అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ నేతల భద్రతపై స్పష్టత..

కొందరు రాజకీయ నాయకులు తమ గన్ మెన్‌లను తగ్గించారని పదే పదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో డీజీపీ కీలక వివరణ ఇచ్చారు. మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో, దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ ప్రజాప్రతినిధుల భద్రతను సమీక్షించి తగ్గించాం. భద్రతను పూర్తిగా తొలగించలేదు. కేవలం ముప్పు (ఒష్ట్రతీమ్ఫ్రావతీఒవజ్ఞాఅశీఅ) స్థాయిని బట్టి అవసరమైన మేరకు మాత్రమే తగ్గించాం. నిఘా వర్గాల నివేదికలు, సెక్యూరిటీ కమిటీ సూచనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నామనీ, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో భారీ సంస్కరణలు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పోలీస్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. మావోయిస్టుల ఏరివేతలో కీలక పాత్ర పోషించిన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి బలగాల సేవలను ఇకపై సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, మరియు ఆహార కల్తీ ముఠాల పట్టుకోసం వినియోగించనున్నారు. త్వరలోనే కొత్త 'తెలంగాణ పోలీస్ మాన్యువల్ ను తీసుకురాబోతున్నామని, శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని డీజీపీ వివరించారు.

# కమలం కోటలో జనసేన జోరు

మొదటి పేజీ తరువాయి

షాక్ లో బీజేపీ శ్రేణులు:

జనసేన గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాలపై సీరియస్ గా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే ప్రజాసమస్యలపై పోరాటాలు ప్రారంభంచిన జనసేన.. సంస్థాగతంగా బలోపేతంపై దృష్టి సారించింది. ఓ వైపు జిల్లాల్లో కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తునే మరోవైపు చేరికలపై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నిన్న పవన్ కల్యాణ్ సమక్షంలో 16 మంది నేతలు జనసేనలో చేరారు. వీరిలో నలుగురు బీజేపీ, దాని అనుబంధ సంస్థలకు పని చేసిన వారు కావడం గమనార్హం. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బీజేపీకి చెందిన హైందవి రెడ్డి పాండెం, సనత్ నగర్ కు చెందిన అనిల్ గిడికపల్లి, రవి టెండూల్కర్, బీజేపీ యువజన మోర్చాకు చెందిన ఇల్లందు నియోజకవర్గం నేత గొగ్గల నాగ శ్రావంతిని జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు ఆయా పార్టీలకు చెందిన నేతలు, వివిధ సామాజిక ఉద్యమాకారులను సైతం ఆహ్వానించారు. అయితే జాతీయ రాజకీయాల్లో బీజేపీకి అత్యంత నమ్మకమైన, సన్నిహితమైన పార్టీగా ఉన్న జనసేన తెలంగాణలో మాత్రం తమ సొంత నేతలను చేర్చుకోవడం ఇప్పుడు బీజేపీ క్యాడర్?ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

సెట్ రైట్ చేస్తున్న సమయంలో డిస్టర్బ్:

రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమే అయినా ఒకే కూటమిలో ఉన్న ఈ రెండు పార్టీల మధ్య సాగుతున్న ఈ రాజకీయం పట్ల పొలిటికల్ సర్కిర్స్ లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర స్థాయి నేతల మధ్య ఉన్న విభేదాలను సెట్ రైట్ చేసి అందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇన్నాళ్లు అగ్రనేతల మధ్య ఉన్న గ్యాప్ కారణంగా పార్టీ డీలా పడిపోయిందని ఇక వీటన్నిటికి చెక్ పెట్టేందుకు అధిష్టానం దూతలు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఇన్నాళ్లు ఎడమొహం పెడమొహం అన్నట్లు ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఒక్కటయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఇటువంటి తరుణంలో బీజేపీపై జనసేన నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, ఆ పార్టీ చర్యలు కమలం పార్టీలో కొత్త డిస్ట్రబెన్స్ కు గురి చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సొంత ఎజెండానా? పార్టీపై నమ్మకం లేకనా?:

రాష్ట్రంలో వీలైనంత మంది ఇతర పార్టీలోని నేతలను బీజేపీలోకి చేర్చుకోవాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్, మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డ లాంటి కీలక నేతలు రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేస్తుంటే సొంత నేతలు మాత్రం పక్క పార్టీలోకి అది కూడా తమ మిత్రపక్షం గూటికి చేరుతుండటం వెనుక ఏం జరుగుతోందనే చర్చ తెరపైకి వస్తోంది. ముఖ్యంగా బీజేపీపై నమ్మకం లేకనే పార్టీని వీడుతున్నారా? లేక ఇక్కడే ఉంటే అవకాశాలు దక్కవని జనసేనను ఎంచుకుంటున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిజానికి గత కొంత కాలంగా తెలంగాణ బీజేపీలో జరుగుతున్న పరిణామాలు అందరిని ఆశ్చర్య పరుస్తున్నాయి. ఇటీవల తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ సైతం తెలంగాణ నేతలతో గడిపిన సమయం కంటే ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ తో గడిపిన సమయమే ఎక్కువ అనే అభిప్రాయాలు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపించాయి. మోడీ వచ్చి వెళ్లాకే పవన్ కల్యాణ్ తెలంగాణలో స్పీడ్ పెంచినట్లు డిస్కషన్ నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఏం జరగబోతోంది? ముఖ్యంగా బీజేపీ, జనసేన మధ్య పరిస్థితి ఎలా ఉండబోతోంది అనేది కాలమే సమాధానం చెప్పనుంది.







# ఆటోగ్రాఫ్.. స్వీట్ మెమరీస్

- ఆత్మీయ భరితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- ఎస్ ఎన్ వై ఎస్ స్కూల్ వార్షికోత్సవం వేడుకలు

- దాదాపు 43 ఏళ్ల తర్వాత కలుసుకొన్న స్నేహితులు
- ఆత్మీయత పంచుకొన్న ఫ్రెండ్స్
- ఉన్నత స్థితిలో స్థిరపడిన అలనాటి మిత్రులు
- కుటుంబాలతో సహా ఆత్మీయ సమ్మేళనం

పచ్చని ప్రకృతి ఒడిలో, ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పిన బడి పవిత్రమైన దేవాలయం. కాలచక్రం ఎంత వేగంగా తిరిగినా, వయసు ఎంత పైబడినప్పటికీ నాటి బాల్య జ్ఞాపకాల మధురిమలు ఎప్పటికీ చిరస్మరణీయమే. నాటి తరగతి గది జ్ఞాపకాలు, గురువుల అభయ హస్తాలు ప్రతి ఒక్కరి హృదయ అంతరంగాల్లో నిత్య నూతనంగా పచ్చగానే ఉంటాయి.

వైఎస్సార్ కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, కొండమాచుపల్లి గ్రామంలోని ప్రసిద్ధ ఎస్.ఎన్.వై.ఎస్ సంస్కృత ఎయిడెడ్ హైస్కూల్ ప్రాంగణం నాటి తీపి జ్ఞాపకాలకు, గురుపూజా మహోత్సవానికి నిలయంగా మారింది. వసంత సమీరంలా సాగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, ప్రతి ఒక్కరిలోనూ చిన్ననాటి మధుర స్మృతులను పునర్నవీకరించింది.

పాఠశాల హెడ్మాస్టర్ మామిళ్ళ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఓ.ఎస్.ఎస్.సి 1982-1983 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో కోలాహలంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కాలం తరువాత, విభిన్న రంగాల్లో స్థిరపడిన విద్యార్థులంతా ఒక్కచోటకు చేరడం ప్రాంగణానికి ఒక కొత్త శోభను తెచ్చిపెట్టింది.

నాడు ఒకే బెంచీపై కూర్చుని చదువుకున్న స్నేహితులు, కాలం తెచ్చిన మార్పులతో వృద్ధాప్యపు ఛాయలు తాకుతున్న వేళ, తమ కుటుంబ సభ్యులతో కలిసి ఒకే చోట కలవడంతో ఆ ప్రాంగణమంతా పండగ వాతావరణం సంతరించుకుంది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరినొకరు కౌగిలించుకుంటూ ఆనందబాష్పాలు రాల్చడం అందరినీ కంటతడి పెట్టించింది.

ఈ బడి ఒడిలో విద్యాబుద్ధులు నేర్చుకున్న నాటి అక్షర శిల్పులు, నేడు సమాజంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. ఐఏఎస్, గ్రూప్-1 అధికారులుగా, సీఐ, ఎస్సైలుగా, ప్రముఖ పారిశ్రామికవేత్తలుగా, రాజకీయ నాయకులుగా రాణిస్తూ ఈ మాతృసంస్థ కీర్తి పతాకాన్ని నలుదిశలా ఎగురవేశారు.

సభను ఉద్దేశించి పూర్వ విద్యార్థులు మాట్లాడుతుండగా నాటి రోజులు కళ్లముందు మెదిలాయి. ఇక్కడ గురువులు నేర్పిన అక్షరమాల, క్రమశిక్షణే తమ జీవిత ఎదుగుదలకు, నేటి స్థానానికి మూలస్తంభాలని ఎంతో వినమ్రంగా స్మరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మదిలో తలుచుకుంటూ సత్కరించుకోవడం తమ పూర్వజన్మ సుకృతమని పులకించిపోయారు.

ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నాటి గురువులను వేదికపై ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, గురుదేవుల పాద పద్మాలకు ప్రణామం చేసి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. తమ శిష్యులు ఉన్నత స్థానాల్లో వెలిగి పోతుండటం చూసి గురువుల కళ్లు ఆనంద బాష్పాలతో తడిసి ముద్దయ్యాయి.

ప్రస్తుత విద్యార్థులలో చదువుపై మరింత ఉత్సాహాన్ని నింపేందుకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని చేపట్టారు. గతేడాది పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి, రెండు, మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు కు జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రస్తుతం పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా గౌరవించారు. వెంకట రామరాజు, రాజేంద్రప్రసాద్ తదితర ఉపాధ్యాయులకు మెమొంటోలు ఇచ్చి, శాలువాలతో సత్కరించి, విద్యావ్యవస్థను ముందుకు నడిపిస్తున్న వారి శ్రమను కొనియాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలిసి ఈ వేడుకను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని మందూరి వెంకటేశ్వర్లు, ఎంసిఆర్ వెంకటసుబ్బయ్య, బంగారు వెంకటయ్య, రామచంద్రరాజు, బాల రామరాజు, పెంచల సుబ్బారెడ్డి తదితరులు సమన్వయం చేశారు.

### మారెళ్ళ పెంచల సుబ్బారెడ్డి ఉదారత::

ఈ ఆత్మీయ కలయికలో ప్రత్యేక ఆకర్షణగా, మాతృభూమి రుణం తీర్చుకునే ఉదారశీలిగా నిలిచారు హైదరాబాదుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, పాఠశాల పూర్వ విద్యార్థి మారెళ్ళ పెంచల సుబ్బారెడ్డి. తాను చదువుకున్న బడికి పూర్వవైభవం తీసుకురావాలనే సంకల్పంతో, పాఠశాల అభివృద్ధికి రూ. 10 లక్షల భారీ విరాళాన్నిలి ఇస్తున్నట్లు ప్రకటించి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 'బోటనీ సుబ్బారెడ్డి' గా మూడు దశాబ్దాల పాటు విద్యా రంగంలో ఆయన శకం నడిచింది. వృక్షశాస్త్రంలో సంక్లిష్టమైన అంశాలను సైతం సులభశైలిలో బోధిస్తూ, లక్షలాది మంది విద్యార్థులను డాక్టర్లుగా, సైంటిస్టులుగా, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది.

విద్యావేత్తగా విజయవంతమైన ప్రయాణం తర్వాత, ఆయన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం 'మెసారా గ్రూప్' సంస్థకు ఛైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, అనేక కంపెనీలను ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. ఇన్ ఫ్రా రంగంలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో సేవలు అందిస్తూ, ఒక అగ్రగామి పారిశ్రామికవేత్తగా తన ముద్ర వేసారు.

తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఉన్నతమైన దృక్పథంతో సుబ్బారెడ్డి నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తన స్వగ్రామమైన తెగచెర్ల రూపురేఖలు మార్చేందుకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించేందుకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల లేమిని గమనించి, నాణ్యమైన, ఆధునిక ఆరోగ్య సేవలను ఉచితంగా, అందుబాటులో అందించేందుకు తెగచెర్లలో ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను నెలకొల్పుతున్నారు. అంతేకాకుండా, శుభకార్యాల నిర్వహణకు ఏ లోటూ రాకుండా ఒక కుగ్రామంలో అన్ని రకాల ఆధునిక సౌకర్యాలతో కూడిన కళ్యాణ మండపాన్ని (ఫంక్షన్ హాలు) నిర్మించి గ్రామ ప్రజల వినియోగానికి అందించారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనలో ఆయన చూపిస్తున్న వినూత్న దార్శనికత, ఉదారత అందరికీ ఆదర్శనీయం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనమును జయప్రదం చేయడానికి కొద్దిరోజులుగా పాత ఫ్రెండ్స్ సమన్వయం చేసుకుంటూ వచ్చారు. బలరామరాజు, రామచందర్ రాజు, మనోహర్ రాజు, ఈగ కొండారెడ్డి, శివరామిరెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర రెడ్డి, రమణారెడ్డి, తుంటి ఎల్లయ్య, సాంబయ్య, బాల నరసింహ, ఎం ఎన్ తిరుమల ప్రసాద్, పల్లి పెంచలయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటసుబ్బమ్మ, హైమవతి, మల్లికార్జున రెడ్డి, ఇంకా ఇతర మిత్రులు.. కార్యక్రమాన్ని సమన్వయం చేసుకొని జయప్రదం చేశారు. అందరికీ మర్చిపోలేని అనుభూతి పంచారు.

# అక్రమాల సబ్ రిజిస్టార్ పై చర్యలు తీసుకోండి...

## కమిషనర్ ను ఆశ్రయించిన బాధితులు...!!

అమరావతి,ఆగస్టు 9(బిఎన్ఎస్): ఆస్తుల అమ్మకాల కొనుగోళ్ల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఏపీ ప్రభుత్వం, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ పలు సూచనలు చేస్తున్నప్పటికీ, కొందరు సబ్ రిజిస్ట్రర్లు మాత్రం లంచాలకే ప్రాధాన్య ఇస్తున్నారు. ఇటీవల కాలంలో పలు సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు జరిపి అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా ఇటీవల కాలంలోనే ఏపీ ప్రభుత్వం స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేసింది. క్రయవిక్రయాల్లో కచ్చితంగా ఆధార్ కార్డు అనుసంధానం చేయాలని, ఈ-కేవైసి ద్వారా వ్యక్తి వేలిముద్ర సహాయంతో ఫోటో సంబంధిత వివరాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే సబ్ రిజిస్టర్ రిజిస్ట్రేషన్ కు అనుమతించాలని, మోసపూరితమైన రిజిస్ట్రేషన్ నివారించాలని ఏపీ ప్రభుత్వం తరపునుంచి, చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అంబేద్కర్ రాష్ట్రంలోని అన్ని జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు సర్క్యులర్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలని అధికారులు చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో కొందరు సబ్ రిజిస్ట్రర్లు ఎటువంటి దస్తావేజులు లేకపోయినా, అసలు వ్యక్తులే రాకపోయినా చకచకా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సబ్ రిజిస్టర్ కార్యాలయం పూర్తిగా అవినీతిలో తూగుతూ, సాక్షాత్తు ఏపీ ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఒక అధికారి బంధువులు ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన సంచలనం కలిగిస్తోంది. దీనిపైన ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లా , స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్టర్ నివేదికను కమిషనర్కు పంపించి ఉన్నారు.

ఈ సంఘటన మరువక ముందే మరొక సంఘటన ఆలస్యం వెలుగులోనికి రావడం చర్చినియాంశంగా మారింది.

కాకినాడకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ రాష్ట్రంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసుకొని వివాదాస్పదమైన రిజిస్ట్రేషన్లు చేయించుతూ ఉంటాడు. ఆ దస్తావేజులను బ్యాంకులకు మార్ట్ గేజ్ గా పెట్టి రుణాలను మంజూరు చేస్తూ ఉంటాడు. ఎవరికి అనుమానం రాకుండా ఆడిటర్ లాగా వ్యవహరిస్తూ ఇటువంటి కార్యక్రమాలు చేస్తుంటాడు.

ఇదే తరహాలో మార్కాపురంలో రిజిస్ట్రేషన్ కాబడి ఉన్న 13 ఎకరాలను తాడేపల్లిగూడెం సబ్ రిజిస్టర్ కార్యాలయం ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించేందుకు, తాడేపల్లిగూడెం లో దస్తావేజు లేఖర్ల ముసుగులో కార్యకలాపాలు సాగిస్తున్న ఇరువురి వ్యక్తులతో కలిసి , తాడేపల్లిగూడెం సబ్ రిజిస్టర్ తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేసేందుకు మూడు లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

ఏదైనా వివాదాస్పదమైతే సులువుగా తప్పించుకునేందుకు అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మూగ మరియు చెవిటి ఉద్యోగితో రిజిస్ట్రేషన్ చేసేందుకు పథకం వేసుకున్నాడు. పథకంలో భాగంగా సబ్ రిజిస్టర్ సెలవు పెట్టి,ఇన్చార్జి రిజిస్టర్ గా విధులు నిర్వహించిన మూగ చెవిటి వ్యక్తితో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించాడు. వివాదాలు వస్తే కేసులో అభం శుభం తెలియని,చెవిటి మూగ వ్యక్తిని ఎంక్వయిరీ పేరుతో అధికారులు ఎదుట బలి పశువును చేసేందుకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్, ఇరువురు దస్తావేజులేఖరులు, రెగ్యులర్ గా వీధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్టర్ గుర్తుచప్పుడు పథకం అమలు చేశారు.




ఈ పొలం మార్కాపురం రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2008లో రిజిస్ట్రేషన్ జరిగి ఉండటంతో, దస్తావేజును ఆన్లైన్లో అక్కడకు బదిలీ చేశారు. దస్తావేజులో పేర్లు వివరాలు పరిశీలించిన మార్కాపురం సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ రికార్డులో ఉన్న పేరుకు, దస్తావేజులు పొందుపరిచిన ఆధార్ వివరాలకు, పేరు సరిపోవటం లేదని, అనుమతి నిరాకరించారు.

అయినప్పటికీ సెలవులో ఉన్న సబ్ రిజిస్టర్ ,ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ అయిన మూగ చెవిటి వ్యక్తితో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించాడు. తదనంతరం ఈ విషయం బయటికి రావడం అసలు పొలం యజమాని అమరావతిలోని స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ కమిషనర్ అంబేద్కర్ కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది.

నిజమైన భూ యజమానులకు భద్రత కల్పించాలని ఏపీ ప్రభుత్వం మరియు స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ పలు సూచనలు మార్పులు చేస్తున్నప్పటికీ, అక్రమ రిజిస్ట్రేషన్ చేస్తున్నటువంటి ఈ సబ్ రిజిస్ట్రార్ లాంటి వ్యక్తుల వ్యవహార శైలి కారణంగా, ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే పరిస్థితిలు ఉన్నాయి. ఇప్పటికైనా స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అక్రమాలకు అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఉంది.

# తూమాయి,నెల్లేపల్లిలో టిడిపి ఇంటింటి ప్రచారం



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- రాపూరు మండలం తూమాయి,నెల్లేపల్లి పంచాయితీలో ఆదివారం వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మరియు క్లస్టర్ 4 ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇంటింటా ప్రచారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి,సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం రానున్న స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తూమాయి తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రకాష్ రావు, కృష్ణారెడ్డి, గ్రామ బూత్ కన్వీనర్ వెంకయ్య, మల్లికార్జున, సర్వేపల్లి కోటయ్య, తోమాటి పెంచలయ్య, బక్క శంకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల మధ్య ఘర్షణ



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో అర్ధరాత్రి టెన్త్ విద్యార్థులు, ఇంటర్ విద్యార్థుల మధ్య గొడవ తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. శనివారం మధ్యాహ్నం భోజనం దగ్గర చిన్నగా మొదలైన విద్యార్థుల మధ్య గొడవ కాస్త తిరిగి రాత్రి మాట మాట పెరిగి గొడవ పెద్దదయింది. విద్యార్థుల కొట్టుకున్న సమయంలో రూమ్ కి వెళ్ళిన ప్రిన్సిపాల్ వారికి సర్ది చెప్పబోగా ప్రిన్సిపాల్ ను సైతం విద్యార్థులు దుర్భాషలాడారు. విద్యార్థులు తీవ్రంగా దూషించడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల రంగ ప్రవేశం చేసి విద్యార్థులకు తమదైన శైలిలో బుద్ధి చెప్పారు. ఈ క్రమంలో పలువురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి.

# హైడ్రాకు మద్దతుగా కొనసాగుతున్న ర్యాలీలు



హైదరాబాద్, ఆగస్టు 09 : చెరువులు, పార్కులు, నాలాలను పరిరక్షిస్తున్న హైడ్రాకు మద్దతుగా నగరవ్యాప్తంగా ర్యాలీలు కొనసాగుతున్నాయి. హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటిస్తున్నాయి. దేశంలోనే ప్రప్రథమంగా హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నగరంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. హైడ్రా వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఐటీ కారిడార్కు చేరువలోని గండిపేట మండలం పుప్పాలగూడ - నార్సింగ్ సరిహద్దులోని 52.20 ఎకరాల చెరువును కబ్జా కాకుండా కాపాడిన హైడ్రాకు మద్దతుగా పరిసర కాలనీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ నివాసితులు, అపార్టుమెంట్ వాసులు పెద్దయెత్తున ర్యాలీలు నిర్వహించి సమావేశాలు ఏర్పాటు చేసి హైడ్రాకు మద్దతు తెలిపారు. ముష్కిన్ చెరువులో దాదాపు 35 ఎకరాల మేర కబ్జా చేసేయాలని ప్రయత్నించగా ఆక్రమణలను తొలగించి హైడ్రా మొత్తం చెరువును కాపాడింది. గచ్చిబౌలిలోని జనార్ధన హిల్స్ కాలనీలో ఆక్రమనలకు గురైన వరద కాలువను పరిరక్షించడమే కాకుండా.. ఆ కాలువకు ఆనుకుని ఉన్న పార్కును కాపాడినందుకు ఆదివారం పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించి మద్దతు తెలిపారు.

ఇందులో సీనియర్ సిటిజన్లు, మహిళలు, చిన్నారులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. నగర భవిష్యత్ బంగారంలా ఉండాలంటే హైడ్రా ఉండాల్సిందే అంటూ నినదించారు. వరదలు లేని నగరం కావాలనుకుంటే చెరువులను కాపాడుకోవాలని.. ఆ పని చేస్తున్న హైడ్రాకు మద్దతు తెలుపుతున్నామంటూ పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది...

- ప్రజా విశ్వాసమే ప్రభుత్వానికి బలం...
- వైసీపీ హయంలో రాష్ట్రం సర్వనాశనం...
- నవాబుపేట గ్రామంలో జరిగిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం
- కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పచ్చిగళ్ళ రత్నయ్య



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ మరియు యూనిట్ ఇంచార్జ్ పచ్చిగళ్ళ రత్నయ్య పేర్కొన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం రాపూరు మండలం నవాబుపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని కరపత్రాలను అందజేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2.0, అన్నదాత సుఖీభవ, పెంచిన పింఛన్లు తదితర పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులనూ ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. అప్పుడు జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేయడానికే చాలా సమయం పట్టిందన్నారు. అయినా ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 74వ బూత్ కన్వీనర్ సమయం ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 4.2. కేజీల గంజాయి చాక్లెట్లు పట్టివేత..



నానక్ రామ్ గూడ శేర్లింగంపల్లి 2-58/2/3/8 ఇంట్లో అజయ్ సింగ్ అనే వ్యక్తి గంజాయి చాక్లెట్లు అమ్ముతుండగా ఎస్ టి ఎఫ్ సీ టీం ఎస్సై మంజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. నిందితుడు అజయ్ సింగ్ ను గంజాయి చాక్లెట్లను కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

# 'రుద్ర'లో మరో కోణం



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ అడ్వెంచర్ డ్రామా 'వారణాసి'. ప్రథ్వీరాజ్ సుకుమారన్ అత్యంత పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండగా.. మహేష్ బాబుకు జోడీగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించబోతున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత కె.ఎల్. నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ విజువల్ వండర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ వ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోంది. అయితే నేడు సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు టీజర్ లేదా ఏదైనా బిగ్ అప్‌డేట్ వస్తుందని ఎంతో ఆశగా భావించారు. అయితే రాజమౌళి మాత్రం ఆఫ్రికా షెడ్యూల్‌కు సంబంధించిన రెండు పవర్‌ఫుల్ ఫొటోలను షేర్ చేసి అభిమానులను అలరించడమే కాకుండా, మహేష్ బాబు పోషిస్తున్న పాత్ర తీవ్రతను ఎంతో అద్భుతంగా వివరించి సినిమాపై అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేశారు. రుద్ర పాత్ర తనకంటే చాలా గొప్పదైన ఒక లక్ష్యాన్ని నెరవేర్చడానికే జన్మించిందని తెలిపారు.

అతను తను కోరుకోని ఒక విధి లేక గమ్యాన్ని తనతో పాటు మోస్తున్నాడని వెల్లడించారు. రుద్ర పాత్రలో మంచి చమత్కారం, సున్నితత్వంతో పాటు ప్రచండమైన ఉగ్రరూపం కూడా ఉంటుందని, మహేష్ బాబు ఆ పాత్రకు అవే ప్రత్యేక లక్షణాలను అందించారని చెప్పారు. సాధారణంగా కేవలం ప్రచండమైన పాత్రను ఎవరైనా సులభంగా పోషించగలరని, కానీ ఒకే సమయంలో ప్రచండంగానూ, సున్నితమైన భావోద్వేగాలను పండించడం చాలా తక్కువ మంది నటులకే సాధ్యమవుతుందని మహేష్ నటనను ప్రశంసించారు. ఇక ఆఫ్రికా షూటింగ్ అనుభవాల గురించి చెబుతూ.. ఆ రెండు ఫ్రేమ్‌లు ఆఫ్రికా షెడ్యూల్‌లోనివని, ఏ ఆర్టిఫిషియల్ సెట్ కూడా ఇవ్వలేని అద్భుతమైన అనుభూతిని ఆ నేల తమకు అందించిందని పేర్కొన్నారు. కిలిమంజారో పర్వత ప్రాంతంలో, మసాయి మారా అడవులలో చిత్రీకరణ చేస్తున్నప్పుడు తాను మైమరచిపోయి నివ్వెరపోయానని తెలిపారు. కొన్ని ఉదయాల్లో తమ కళ్లముందు ఉన్న ప్రకృత్యందాలను 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్ కూడా పూర్తిగా బంధించలేదేమో అనిపించిందని ఆఫ్రికా విజువల్స్ విశేషాలను పంచుకున్నారు. దీంతో 'వారణాసి'పై అంచనాలు మరింత పెరిగాయి.

# ఆగస్టులో నయన్ సందడి




నయనతార సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా ఏళ్లు అవుతోంది. అయినప్పటికీ ఇప్పటికీ వరుస సినిమాలతో తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఇక ఈ ఆగస్టు నెలలో నయనతార కేవలం రెండు రోజుల గ్యాప్‌లోనే రెండు క్రేజీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కన్నడ స్టార్ హీరో యష్ ప్రధాన పాత్రలో నటించిన 'టాక్సిక్' చిత్రంలో నయనతార కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. అనంతరం ఆగస్టు 28న నయనతార హీరోయిన్‌గా, కెవిన్ సరసన నటించిన రొమాంటిక్ కామెడీ డ్రామా 'హాయ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

ఇలా నయనతార నటించిన రెండు చిత్రాలు కేవలం రెండు రోజుల గ్యాప్‌లోనే విడుదల కానున్నాయి. అంతేకాకుండా ఈ రెండు సినిమాల జోనర్ల మధ్య కూడా ఎలాంటి సంబంధం లేకపోవడంతో.. ఈ చిత్రాల్లో నయనతార తన నటనతో ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇక నయనతార సాధారణంగా తాను నటించిన సినిమాల ప్రమోషన్ కార్యక్రమాలకు పెద్దగా హాజరు కారు. అయితే తాజాగా 'టాక్సిక్' ట్రైలర్ ఈవెంట్‌కు ఆమె హాజరు కావడం విశేషం. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

# వరుణ్‌కు ప్రభాస్ సర్‌ప్రైజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన 'కొరియన్ కనకరాజు' చిత్రం ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కూడా 'కొరియన్ కనకరాజు' విజయంపై స్పందిస్తూ చిత్రబృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రభాస్ తన సోషల్ మీడియా ఖాతాలో 'కొరియన్ కనకరాజు' పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్, దర్శకుడు మెర్లపాక గాంధీ, రితిక నాయక్, సత్యలకు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే 'కొరియన్ కనకరాజు' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నందుకు యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలకు కూడా అభినందనలు తెలియజేశారు. ప్రభాస్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన తోటి హీరో సినిమా విజయాన్ని ప్రశంసిస్తూ ప్రభాస్ చేసిన ఈ పోస్ట్‌పై వరుణ్ తేజ్ అభిమానులు, సినీ ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరుణ్ తేజ్‌తో పాటు చిత్రబృందానికి ప్రభాస్ నుంచి వచ్చిన ఈ ప్రత్యేక అభినందనలు మరింత ఉత్సాహాన్ని అందిస్తున్నాయి. ఇక ఈ చిత్రంలో రితిక నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య కీలక పాత్రలో కనిపించారు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాకు మెర్లపాక గాంధీ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు నిర్మించాయి.




# ఓటీటీలో దీవానా హవా

హర్షిత్ రెడ్డి, స్నేహ మణిమేగలై ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దీవానా'. శ్రీకాంత్ సంగిశెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. విడుదలకు ముందు చిత్రబృందం పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అలా భారీ అంచనాల నడుమ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి మంచి టాక్ లభించింది. దీంతో లాంగ్ రన్‌లో డీసెంట్ కలెక్షన్లు సాధించి యావరేజ్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక ఈ చిత్రం కొన్ని రోజుల క్రితమే ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ 'దీవానా'కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా కేవలం వారం రోజుల్లోనే 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం.. ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈశ్వర్ చంద్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వి.స్టూడియోస్ బ్యానర్లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మించారు.

